# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక · ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY · 9 సంవత్సరాల ప్రయాణం


సంపుటి : 10  సంచిక : 339  పేజీలు : 12  సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)  ప్రచురణ : విశాఖపట్నం  మంగళవారం 20 ఆగస్టు 2024  వెల : 5/-రూ॥

VOLUME :10  ISSUE : 339  PAGES : 12  EDITOR : G. A. RAO ( ANAND GANTYADA )  PUBLISHED : VISAKHAPATNAM  TUE 20 AUGUST 2024  PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## అంతా బెంగళూరు నుంచే ... తాడేపల్లి నుంచి షిఫ్ట్....

నాగేశ్వర రావు (నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు



జగన్ ఎందుకో ఏపీలో ఉండేందుకు పెద్దగా ఇష్టపడటం లేదు. పని ఉంటే మాత్రమే తాడేపల్లి ప్యాలెస్ కు వస్తున్నారు. పని ముగిసిన వెంటనే బెంగళూరు వెళుతున్నారు. తాడేపల్లి ప్యాలెస్ అంత సేఫ్ కాదని భావిస్తున్నట్లు ఉన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉంది. తనపై నిఘా ఉంటుందని భావిస్తున్నట్లు ఉన్నారు. అందుకే ఇక్కడ ఎటువంటి రాజకీయ కార్యకలాపాలు జరపకూడదని భావిస్తున్నారు. నేరుగా బెంగళూరు నుంచి చేసుకుంటే పెద్దగా ఇబ్బంది ఉండదని.. అదే హైదరాబాద్ అయితే చంద్రబాబుకు అనుకూల ప్రభుత్వం అక్కడ ఉందని అంచనా వేస్తున్నారు. అందుకే ఎన్నికల్లో ఓడిపోయిన

వివరాలు 2లో..


# ప్రతి నలుగురు భారతీయ ఐటీ నిపుణుల్లో ఒక ఏపీ వ్యక్తి ఉంటాడు

- శ్రీ సిటీలో సీఎం చంద్రబాబు పర్యటన
- 30 కంపెనీల సీఈవోలతో చంద్రబాబు సమావేశం
- ఇదొక అపూర్వ ఘట్టం అని పేర్కొన్న సీఎం



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి శ్రీ సిటీ పర్యటనకు విచ్చేశారు. శ్రీ సిటీలో వివిధ కంపెనీల సీఈవోలతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశ్రామికవేత్తలు సంపద సృష్టిస్తూ ఉపాధి కల్పిస్తున్నారని కొనియాడారు. ఇవాళ ఒకే చోట 30 కంపెనీల ప్రతినిధులతో భేటీ గొప్ప విషయం అని, ఇదొక అపూర్వ ఘట్టం అని పేర్కొన్నారు.
పరిశ్రమల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని అన్నారు. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయని, తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పెట్టుబడులు రాబట్టేందుకు అనేక దేశాల్లో పర్యటించానని చంద్రబాబు వెల్లడించారు. భారత్ ను ఐటీ రంగం ప్రపంచపటంలో నిలుపుతుందని ఆనాడే చెప్పానని గుర్తుచేశారు.
ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారని, ప్రపంచంలోని ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒక భారతీయుడు ఉంటారని, ప్రతి నలుగురు భారతీయ ఐటీ నిపుణుల్లో ఒకరు ఏపీ వ్యక్తి ఉంటారని వివరించారు. అదీ ఏపీ సత్తా అని పేర్కొన్నారు. దేశంలో హైదరాబాదులో అత్యుత్తమ మౌలిక సదుపాయాలు ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. హైదరాబాద్ ప్రజల నివాసాలకు అనుకూల ప్రాంతంగా ఉందని పేర్కొన్నారు. గతంలో పీపీపీ విధానంలో హైటెక్ సిటీ నిర్మాణం చేపట్టామని తెలిపారు.
శ్రీ సిటీలో 8 వేల ఎకరాల్లో పారిశ్రామిక జోన్లు ఏర్పాటయ్యాయని, ఇక్కడ సెజ్, డొమెస్టిక్ జోన్, ఫ్రీ ట్రేడ్ జోన్ ఏర్పాటయ్యాయని వివరించారు. ఇప్పటికే శ్రీ సిటీ నుంచి 220 కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని... ఇక్కడ ఆటోమేటివ్, ఎలక్ట్రానిక్స్, ఎఫ్ఎంసీజీ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కూడా వచ్చాయని అన్నారు.
4.5 బిలియన్ డాలర్ల పెట్టుబడుల సాధన గొప్ప విషయం అని, 4 బిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించడం మామూలు విషయం కాదని చంద్రబాబు తెలిపారు.
చెన్నై, కృష్ణపట్నం, తిరుపతి ప్రాంతాలకు శ్రీ సిటీ దగ్గరగా ఉందని, శ్రీ సిటీని అత్యుత్తమ ఎకనామిక్ జోన్ గా అభివృద్ధి చేయాలనేది తన ఆలోచన అని స్పష్టం చేశారు. శ్రీ సిటీకి ఐజీబీసీ గోల్డెన్ రేటింగ్ గుర్తింపు కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. శ్రీ సిటీకి అన్ని రకాల మౌలిక సౌకర్యాలు ఉన్నాయని, దీన్ని అత్యంత అనుకూల నివాసయోగ్య ప్రాంతంగా మార్చుతామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. శ్రీ సిటీలో సహజంగానే చల్లని వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.కంపెనీలు వీలైనంతగా ఉత్పత్తి, లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించుకోవాలని... ఈ ధరల తగ్గింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.
ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఏపీ రాజధాని అమరావతి ప్రస్తావన తెచ్చారు. కొత్త రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నామని, రాజధాని నిర్మాణం కోసం 29 వేల మంది రైతులు
34 ఎకరాల భూమిని ఇచ్చారని వెల్లడించారు. ఇంటింటికీ తాగునీరు, విద్యుత్, ఫైబర్ నెట్ అందిస్తున్నామని... మున్ముందు గ్యాస్ తో పాటు ఏసీ కూడా పైప్ లైన్ల ద్వారా ఇంటింటికీ అందిస్తామని చంద్రబాబు తెలిపారు. పారిశ్రామికవేత్తలు వినూత్న ఆలోచనలతో ముందుకురావాలని కోరుతున్నానని పిలుపునిచ్చారు. 2029 నాటికి భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. తాము విజన్-2047 ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. 2047 నాటికి భారత్ నెంబర్ వన్, లేదా నెంబర్ టూ స్థానంలో ఉంటుందని జోస్యం చెప్పారు.

## సెప్టెంబర్ లో పూర్తి స్థాయి బడ్జెట్




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయవాడ, ఆగస్టు 19:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టే విషయమై ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. సెప్టెంబర్ నెలలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. ఈ నెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు వివిధ శాఖలతో ఆర్థిక శాఖ వరుస సమావేశాలు కానుంది. బడ్జెట్ అంచనాలు పంపాలని కోరుతూ అన్ని శాఖల ఉన్నతాధితారులకు

వివరాలు 2లో..

## ఉల్లికి భారీ డిమాండ్



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ కర్నూలు, ఆగస్టు 19:** దేశవ్యాప్తంగా ఉల్లిగడ్డ ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. కొన్ని నెలల క్రితం కేజీ ఉల్లి ధర రూ.20-30 వరకు ఉండగా.. ప్రస్తుతం

వివరాలు 2లో..

## ఆగని ఆరాచకాలు...



స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ ఏలూరు, ఆగస్టు 19 సమాజంలో మనిషి మాయమవుతున్నాడు. జంతువును జంతువు వేటాడే ఆటవిక రాజ్యంగా సమాజం మారుతోంది. స్నేహం చేసిన పాపానికి.. స్నేహితుడి భార్యని చెరిచారు ముగ్గురు యువకులు. భర్త ఎదుటే ఆమెను తీసుకెళ్లి అత్యాచారం చేశారు. ఈ దారుణ ఘటన ఏలూరులో వెలుగు చూసింది. మూడు పోలీస్ స్టేషన్లకు కూత వేటు దూరంలో ఈ దారుణం జరిగింది. 15 రోజుల క్రితమే నగరానికి చేరుకున్న ఆ దంపతులు పగలంతా హోటల్లో పనిచేసి.. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే స్టేజీపై పడుకునేవారు. ఇల్లు అద్దెకు దొరికే వరకు అక్కడే గడుపుతున్నారు. ఇంతలో నగరానికి చెందిన ముగ్గురు యువకులు వారికి పరిచయమయ్యారు. వారు చిన్న చిన్న పనులు చేసుకుంటూ జులాయిగా తిరిగేవారు.

వివరాలు 11లో..

## ఏపీలో ఓ అనాథాశ్రమంలో ఫుడ్ పాయిజనింగ్... ముగ్గురు చిన్నారుల మృతి

- అనకాపల్లి జిల్లాలో ఘటన
- నిన్న సమోసాలు తిన్న పిల్లలు
- అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రులకు తరలింపు
- చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

వివరాలు 2లో..




అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఉన్న ఓ అనాథాశ్రమంలో ఫుడ్ పాయిజనింగ్ కారణంగా ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ అనాథాశ్రమం నిర్వహిస్తున్నారు. నిన్న సమోసాలు తిన్న తర్వాత

## జగన్ ఎందుకిలా....

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ ఏలూరు, ఆగస్టు 19:** జగన్ సీనియర్లకు పిలిచి మాట్లాడడం లేదా?వారిని అసలు పట్టించుకోవడం లేదా? ఎన్నికల్లో చూద్దాంలే అని ధీమాతో ఉన్నారా? తనకు జనంతో పని.. నేతలతో లేదనుకుంటున్నారా? అందుకే ఒక్కొక్కరు పార్టీకి దూరమవుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఎన్నికల ఫలితాల అనంతరం చాలామంది నేతలు పార్టీకి దూరమయ్యారు. విజయవాడ ఎంపీగా పోటీ చేసిన కేశినేని నాని క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెప్పారు. సినీ నటుడు అలీ తనకు వైసీపీతో సంబంధం లేదని తేల్చి చెప్పారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పార్టీకి గుడ్ బై చెప్పారు. గుంటూరుకు

వివరాలు 2లో..




## రోజా అరెస్ట్ కు రంగం సిద్ధం



**బ్యూరో రిపోర్టు పెన్‌పవర్, తిరుపతి, ఆగస్టు 19:** నాటి నటి.. నిన్నటి ఎమ్మెల్యే.. నేడు మాజీ మంత్రి ఆర్కే రోజాకు ఆడుదాం ఆంధ్రా క్రీడలు ఉచ్చు బిగిస్తుందా అంటే అవును అనే సమాధానం వినిపిస్తోంది. అసలు క్రీడా శాఖ మంత్రిగా ఉన్న ఆమెపై ఇప్పుడు

వివరాలు 2లో..

## పోలవరం ఫైల్స్ దగ్ధం కేసు

### నలుగురు ఉద్యోగులు సస్పెండ్




బ్యూరో రిపోర్టు పెన్‌పవర్, ఏలూరు, ఆగస్టు 19: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీసులో ఫైళ్లు దగ్ధం తరువాత తూర్పుగోదావరి జిల్లాలోనే అలాంటి సీన్ రిపీట్ అయింది. టీటీడీలోనూ కొన్ని ఫైళ్లు కాలిపోయిన ఘటన సైతం సంచలనంగా మారింది. ధవళేశ్వరంలోని ఇరిగేషన్ కార్యాలయంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ఫైళ్లు దగ్ధం కేసులో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇరిగేషన్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్లు నూకరాజు, కారం బేబీలతో పాటు స్పెషల్ ఆర్ఐ కళాజ్యోతి, సబార్డినేట్ రాజశేఖర్‌ను తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి సస్పెండ్ చేశారు. దాంతోపాటుగా డిప్యూటీ తహసీల్దార్లు ఎ. సత్యదేవి, ఎ. కుమారిలకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా ఆఫీసు కాగితాలు

వివరాలు 2లో..

## గ్రామస్థాయిలో రెవిన్యూ వ్యవస్థను తీసుకొస్తాం..



తెలంగాణలో గ్రామ స్థాయిలో రెవిన్యూ వ్యవస్థను ప్రవేశ పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రూపకల్పన చేస్తున్న ఈ కొత్త రెవిన్యూ చట్టంలో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కాంగ్రెస్? ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు, రైతులకు మంచి జరుగుతుందన్నారు. త్వరలో రెవిన్యూ అధికారులకు ప్రమోషన్స్? ఉంటాయన్నారు. బీఆర్?ఎస్? ప్రభుత్వం రెవిన్యే వ్యవస్థను చులకన చేసిందంటూ.. గ్రామ రెవిన్యూ అధికారులను

వివరాలు 2లో..

## పంచాయతీరాజ్ శాఖపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష

- రాష్ట్ర సచివాలయం నుంచి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్
- హాజరైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు
- ఉపాధి హామీ పథకంపై పవన్ దిశానిర్దేశం



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, 26 జిల్లాల జడ్పీ సీఈవోలు, డీపీవోలు, డ్వామా పీడీలు, ఎంపీడీవోలు,

వివరాలు 2లో..

# సంపాదకీయం

## ప్రాణదాతల మాన ప్రాణాలకు భద్రత కరువా..

మనిషి రూపంలో ఉండే దేవుడే వైద్యుడు. అందుకే వైద్యో నారాయణో హరి అంటారు. కానీ మానవత్వం మంటగలిసి కనికరం అన్నదే లేకుండా.. అమానుషమే నీడలా వెంటాడి లేడీ డాక్టర్ల ప్రాణాలు తీస్తోంది. ప్రాణదాతల మాన ప్రాణాలకు భద్రత కరువైంది. సేఫ్టీ, సెక్యూరిటీ లేక ప్రతి క్షణం టెన్షన్ టెన్షన్ గా ఒత్తిడిలో డ్యూటీ చేస్తున్నారు లేడీ డాక్టర్లు. కోల్ కతా డాక్టర్ హత్యాచారం కేసు దేశాన్ని కుదిపేస్తోంది. ఆందోళనలు ఓవైపు, డాక్టర్ల సమ్మె మరోవైపు.. కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచుతున్నాయి. కోల్ కతా డాక్టర్ కేసు సామూహిక హత్యాచారమా? సీబీఐ విచారణలో అసలు విషయాలు వెలుగులోకి వస్తాయా? అసలేం జరిగింది?ఆదివారాలు లేవు. ఆనందాలు అంతకన్నా లేవు. పర్సనల్ లైఫ్ మాటే లేదు. పేషెంట్ ప్రాణాలు కాపాడటమే విధి. వైద్య వృత్తిని చాలా పవిత్రంగా భావించే డాక్టర్లు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. మెంటల్ ప్రజర్, సేఫ్టీ, సెక్యూరిటీ వంటి సమస్యలు ఉన్నా.. వైద్య వృత్తిలోకి మహిళలు ఎక్కువగా వస్తున్నారు. అలా వృత్తిని నమ్మి ప్రాణాలను నిలబెట్టే ప్రాణదాతల ప్రాణాలకే రక్షణ లేకుండా పోతోంది. లేడీ డాక్టర్లకే కాదు మహిళలకు భద్రత కరువైపోయింది. కోల్‌కత్తా ఘటన ఇప్పటికీ ఓ మిస్టరీయే. ఆగస్టు 9న హత్యాచారం జరిగింది. ఇప్పటికి 10 రోజులు గడిచిపోయాయి. ఇప్పటికీ ఈ కేసులో ఏ పురోగతి కనిపించడం లేదు. సీబీఐ విచారణ జరుగుతోందన్న ఒక్క సమాచారం తప్ప మరేమీ తెలియడం లేదు. అసలు ఎందుకు అత్యాచారం చేశారు..? ఆ అత్యాచారం చేసిన వ్యక్తి అక్కడికి ఎలా వచ్చాడు..? అంత దారుణంగా హింసించి చంపాల్సినంత కక్ష ఏముంది..? ఇలా ప్రశ్నల మీద ప్రశ్నలు తెరపైకి వస్తూనే ఉన్నాయి. వీటిలో దేనికీ ఇంకా సమాధానం దొరకలేదు. ఇలా ఎన్నో "లేదు, కాదు" లు ఉండడం వల్లే పెద్ద కన్ఫ్యూజన్ ఏర్పడింది. ఎవరికి తోచిన "థియరీ" వాళ్లు చెబుతున్నారు.ట్రైనీ డాక్టర్‌తో పాటు పని చేసే వాళ్ల వర్షన్ మాత్రం ఈ కేసుని మలుపు తిప్పేలా కనిపిస్తోంది. ఆమెని టార్గెట్ చేసి చంపారన్నది వాళ్లు చెబుతున్న థియరీలోని సారాంశం. అదే ఎందుకు అని ప్రశ్నిస్తే వాళ్లు చెప్పిన సమాధానాలు సంచలనం కలిగిస్తున్నాయి. "ఓ సీనియర్ వల్ల నా కూతురు చాలా ఇబ్బంది పడింది" అని వెల్లడించారు. వాళ్లు చెప్పిన దాన్ని బట్టి చూస్తే హాస్పిటల్‌లో ఏదో రాజకీయం జరిగి ఉండాలన్న అనుమానం వ్యక్తమవుతోంది. ఇక కొలీగ్స్ చెబుతున్న అంశాలూ కీలకంగా మారాయి. ఈ కేసులో సంజయ్ రాయ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. బాధితురాలి కొలీగ్స్ ఇదే పేరుని పదేపదే ప్రస్తావిస్తున్నారు. "ఇది కేవలం హత్యాచారం కేసు కాదు. అంతకి మించి ఇంకేదో కుట్ర ఉంది. ఆమె సెమినార్ హాల్‌లో ఒంటరిగా ఉందని ఆ వ్యక్తికి ఎలా తెలిసింది" అని ప్రశ్నిస్తున్నారు తోటి వైద్యులు. ఇక మరో సంచలన విషయం ఏంటంటే...హాస్పిటల్‌లో పెద్ద ఎత్తున డ్రగ్ రాకెట్ జరుగుతోంది, ఆ రహస్యాలన్నీ బాధితురాలికి తెలిసిపోయి ఉంటాయని అంటున్నారు. అందుకే..ఆ రహస్యాలు ఎక్కడ బయటపెడుతుందో అన్న భయంతో ఆమెని ఇంత దారుణంగా చంపేసి ఉంటారని కొందరు అనుమానిస్తున్నారు.అయితే...కొందరు ఆమెని కావాలనే టార్గెట్ చేసి ఎక్కువ గంటలు పని చేయించినట్టు చెబుతున్నారు. ఆమె డైరీలో కూడా ఈ వర్క్ ప్రెజర్ గురించి రాసుకున్నట్టు తల్లిదండ్రులు ఇప్పటికే వెల్లడించారు. ఒక్కోసారి 36 గంటల పాటు కంటిన్యూగా పని చేయాల్సి వచ్చింది. ఈ ఘటన జరిగిన రోజు రాత్రి హాస్పిటల్ మాజీ ప్రిన్సిపల్ కనిపించకుండా పోయాడు. సీబీఐ రంగంలోకి దిగాక ఆయనపై నిఘా పెంచింది. ఆ రాత్రి ఎక్కడున్నారని విచారిస్తోంది. ఆయన చెప్పిన వివరాలను, హాస్పిటల్‌లోని మిగతా వైద్యుల వర్షన్‌ని పోల్చుకుని చూసుకుంటోంది సీబీఐ. తెల్లవారుజామున 3-5 గంటల మధ్యలో ఈ హత్యాచారం జరిగినట్టు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో తేలింది. ఆ టైమ్ కూడా ఈ కేసుని ఛేదించడంలో కీలకంగా మారనుంది. జూనియర్ డాక్టర్ పై ఘటనలో ప్రచారం అవుతున్న విషయాలపై పోలీసులు స్పందించారు. సోషల్ మీడియాలో, ప్రధాన మీడియాల్లో ప్రచారం అవుతున్న విషయాల్లో చాలా వరకు నిజం కాదని, ఆ వదంతుల్లో వాస్తవం లేదని కోల్‌కతా పోలీసులు కొట్టిపారేశారు. డాక్టర్ పోస్టుమార్టం ప్రక్రియ మేజిస్ట్రేట్ ఎదుట జరగగా, వీడియో తీశారు. అయితే ఆమె శరీరంలో ఎక్కడా ఎముకలు విరిగినట్లు పోస్టుమార్టం రిపోర్టులో లేదన్నారు కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినేశ్ గోయల్.. సామూహిక అత్యాచారం జరిగిందని, శరీరంలో దాదాపు 150 మిల్లీగ్రాముల వీర్యం ఉందన్న ప్రచారంలో నిజం లేదన్నారు. డాక్టర్ తల్లిదండ్రులు కోర్టులో వేసిన పిటిషన్ వల్లే చాలా వరకు వదంతులు పుట్టుకొచ్చాయన్నారు. వినేశ్ గోయల్ మాట్లాడుతూ.. ట్రెయినీ డాక్టర్ శరీరంలో 150 మిల్లీగ్రాముల వీర్యం గుర్తించారనేది నిజం కాదన్నారు. కొందరు ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు ఈ కేసు వివరాలపై దుష్ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ట్రెయినీ డాక్టర్ ది "అసహజ మరణం"గా పోలీసులు కేసు నమోదు చేయడం సైతం వివాదాస్పదమైంది. ఆసుపత్రి నుంచి పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై కలకత్తా హైకోర్టు ప్రశ్నించింది. ఎలాంటి ఫిర్యాదు రానప్పుడు అసహజ మరణం కేసు నమోదు చేయడం సాధారణ ప్రక్రియ అన్నారు. కేసు ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని తమపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆమె తల్లిదండ్రులు కొందరు అనుమానితుల పేర్లను సీబీఐకి ఇచ్చారని, కొన్ని సోషల్ మీడియా పోస్టులతో సహచర డాక్టర్లను అనుమానితులుగా ప్రచారం జరిగింది. కానీ వాస్తవం ఏంటంటే.. ఇప్పటివరకూ ఒక్క వాలంటీర్ సంజయ్ రాయ్ పేరు మినహా ఏ ఇతర అనుమానితుల పేర్లను రికార్డుల్లో పేర్కొనలేదు. నిందితుడైన వాలంటీర్ ను పోలీసులు ఇదివరకే అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.రాత్రివేళ ప్రభుత్వ ఆసుపత్రిలో పీజీ సెకండియర్ చదువుతున్న జూనియర్ డాక్టర్ విధుల్లో ఉన్నారు. కానీ అనూహ్యంగా మరుసటి రోజు ఉదయం 10 గంటలకు హాస్పిటల్ సెమినార్ హాలులో ఆమె అర్ధనగ్న స్థితిలో చనిపోయి కనిపించారు. దేశ వ్యాప్తంగా నిరసన, ఆందోళన జరగడంతో ఈ కేసును కలకత్తా హైకోర్టు సీబీఐకి బదిలీ చేసిందినిర్భయ, దిశ లాంటి చట్టాలు వచ్చినా అఘాయిత్యాలు మాత్రం ఆగడం లేదు. మహిళలను ఈ భయం ఇంకెన్నాళ్లు వెంటాడుతుంది? శారీరక దాడులు తప్పేది ఎప్పుడు? మహిళలకు గాంధీజీ కలలుకన్న స్వాతంత్ర్యం రానట్లేనా?

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు

# జగన్ ఎందుకిలా....

- మొదటి పేజీ తరువాయి

చెందిన కిలారి రోశయ్య, మద్దాలి గిరి వంటి వారు పార్టీని వీడారు. తాజాగా ఆళ్ల నాని పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కానీ వీరెవరితోనూ జగన్ నేరుగా మాట్లాడలేదని తెలుస్తోంది. జనంతో తన పని అని.. నాయకులతో పని లేదన్నట్టు జగన్ వ్యవహరిస్తున్నారు. మళ్లీ పార్టీ పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తే నేతలు వారే దారిలోకి వస్తారని అంచనా వేస్తున్నారు. అందుకే పెద్దగా పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. పార్టీ నుంచి వెళ్ళిపోతామన్నవారికి అడ్డుకోవడం వేస్ట్ అని.. వారిని బతిమిలాడి తెచ్చినా పార్టీలో వారు ఉండరు అన్నది హై కమాండ్ అభిప్రాయం. అయితే అధికారంలో ఉన్నప్పుడు ఈ తరహా అభిప్రాయం నిజమే. కానీ వైసీపీ ఇప్పుడు ప్రతిపక్షం. అందులోనూ ఘోర ఓటమి ఎదురైన సమయం. ఇప్పుడు జాగ్రత్తగా అడుగులు వేయకపోతే పార్టీకి మరింత ముప్పు తప్పదు.వైసిపి తో పాటు అధినేత పై మంచి అభిప్రాయం ఉన్నవారు ప్రస్తుతం గుంభనంగా ఉన్నారు. కానీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ వైఖరితో బాధపడిన వారు, నచ్చని నేతలు ఇప్పుడు బయటపడుతున్నారు. పార్టీ నుంచి బయటకు వెళు_న్నారు. ఇక అధినేత వైఖరిలో మార్పు రాదని.. పార్టీ మళ్లీ పూర్వవైభవం సాధించినా తమ వరకు ప్రయోజనం ఉండదని భావిస్తున్న నేతలు పార్టీకి గుడ్ బై చెబుతున్నారు.గెలిస్తే తన విజయమని చెప్పుకునే స్థితిలో జగన్ ఉంటారు. ఓడిపోతే మాత్రం మిగతా నేతల వైఫల్యం అని చెప్పుకొస్తారు. చాలామంది నేతలు రుచి చూశారు వైసీపీలో. పార్టీ గెలిచినప్పుడు విధులు ఉండవు.. నిధులు ఉండవు. అంతకంటే మించి విలువ ఉండదు. అటువంటి పార్టీలో కొనసాగడం దండగ అన్న అభిప్రాయం చాలామంది వైసిపి నేతల్లో ఉంది.ఆళ్ల నాని లో అసంతృప్తి ఇప్పటిది కాదని తెలుస్తోంది. 2022లో మంత్రి పదవి నుంచి తప్పించారు. దీంతో ఆయనకు హై కమాండ్ తో గ్యాప్ ఏర్పడింది. 2024 ఎన్నికల్లో టికెట్ ఇచ్చేందుకు కూడా ముప్పు

తిప్పలు పెట్టారు. ఆళ్ల నాని ఇబ్బంది పడ్డారు. కానీ పార్టీ మారడానికి ఇష్టపడలేదు. ఇప్పుడు అందరు మాదిరిగానే ఓడిపోయారు. వైసిపి దారుణంగా ఓడిపోయింది. ఇప్పుడు తనకు టైం దొరికింది. ముందుగా పార్టీ పదవులకు రాజీనామా చేశారు. జగన్ పిలిచి మాట్లాడలేదు. ఇదే అదునుగా ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. దీంతో తనకు స్వేచ్ఛ దొరికింది. కొద్ది రోజులపాటు గ్యాప్ తీసుకుని నచ్చిన పార్టీల్లో చేరడానికి నాని సిద్ధం చేసుకుంటున్నారు. అయితే నాని లాంటి నేతలు వైసీపీలో ఇంకా చాలామంది ఉన్నట్లు తెలుస్తోంది.

# అంతా బెంగళూరు నుంచే ... తాడేపల్లి నుంచి షిఫ్ట్....

- మొదటి పేజీ తరువాయి

నాటి నుంచే బెంగళూరు యలహంక ప్యాలెస్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించారు. నెలలో మూడు వారాలపాటు అక్కడే ఉంటున్నారు. మధ్యలో రకరకాల కారణాలు చూపి తాడేపల్లి ప్యాలెస్ కి వస్తున్నారు. చిన్న చిన్న పనులు చూసి మళ్ళీ బెంగళూరు వెళుతున్నారు. గత రెండు నెలల్లో పదిసార్లు బెంగళూరు వెళ్లారు. తాడేపల్లి ప్యాలెస్ కంటే అక్కడే ఎక్కువ రోజులు గడిపారు. జగన్ రాజకీయాల స్టైల్ వేరు. మొన్న ఆ మధ్యన తన అస్మదీయులైన ఐఏఎస్,ఐపీఎస్ అధికారులను పిలిపించుకొని బెంగళూరులో మాట్లాడారట. దాని ఫలితమే సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేసిన అధికారులకు ఏపీ సిఎస్ సరికొత్త ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో ఉండాల్సిందేనని తేల్చి చెప్పారు. వీరంతా రహస్యంగా బెంగళూరులో జగన్ ను కలవడమే ఇందుకు కారణంగా అధికార వర్గాల్లో చర్చ నడుస్తోంది.గత ఐదేళ్లలో జగన్ పుణ్యమా అని అధికార వర్గాల్లో కూడా ఒక గీత ఏర్పడింది. తనకోసం మాత్రమే పనిచేసే అధికారులకు పెద్దపీట వేశారు జగన్. అందుకే ఎక్కడో 15వ సీనియారిటీ ర్యాంకులో ఉన్న రాజేంద్రనాథ్ రెడ్డి ని తెచ్చి ఈ రాష్ట్రానికి డిజిపి చేశారు.అస్మదీయ అధికారులకు పెద్ద పీటవేయడం, ఇష్టం లేని వారికి పోస్టింగ్ ఇవ్వకుండా తొక్కేయడం గత ఐదేళ్లుగా చూసాం. అటువంటి జగన్ అస్మదీయ అధికారులు ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారుప్రస్తుతానికి బెంగళూరు అయితే సేఫ్ జోన్ అని జగన్ భావిస్తున్నారు. ఇండియా కూటమి వైపు అడుగులు వేయడం ద్వారా కాంగ్రెస్ కు దగ్గరవుతున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు.తద్వారా కర్ణాటకలో కాంగ్రెస్ప్రభుత్వాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. బెంగళూరు నుంచి కార్యకలాపాలు, రాజకీయాలు చేయడం ప్రారంభించారు. అక్కడి నిఘా వర్గాల సాయాన్ని తీసుకుంటున్నారు.

తద్వారా తన రాజకీయ అడుగులు టిడిపి కూటమి పార్టీలకు తెలియకూడదు అన్నది జగన్ ప్లాన్. అందుకే వ్యూహాత్మకంగా బెంగళూరు నుంచి పావులు కదపడం ప్రారంభించారుజగన్కు కేడర్ తో పనిలేదు. కేవలం ఎన్నికల వ్యూహంతోనే తతంగం జరపవచ్చని భావిస్తున్నారు. పైగా 40 శాతం ఓటింగ్ను సొంతం చేసుకున్నామన్న ధీమా ఆయనలో కనిపిస్తోంది. ఆ క్యాడర్ చిక్కుచెదరదన్న అతిధి మాతో ఆయన ఉన్నారు. అందుకే సొంత రాష్ట్రం లో ఉండి రాజకీయం చేయకపోయినా పర్వాలేదన్న నిర్ణయానికి వచ్చారు. అందుకే బెంగళూరును అడ్డగా చేసుకుని రాజకీయాలు చేస్తున్నారు.

# రోజా అరెస్ట్ కు రంగం సిద్ధం

- మొదటి పేజీ తరువాయి

అవినీతి ఆరోపణలు కమ్ముకుంటున్నాయి.మాజీమంత్రి రోజా అనగానే గత పది సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ గా నిలిచిన ఎమ్మెల్యే. వైసీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో అప్పటి ఎమ్మెల్యే, మంత్రీ రోజా మాటలు తూటాలుగా పేలేవి.. ఆమె పవన్ కళ్యాణ్, చంద్రబాబు, లోకేష్ సహా ఎవరి గురించి మాట్లాడినా సోషల్ మీడియా లో వైరల్ గా మారేది. ఇక జనసైనికుల నుంచి అనేక విమర్శలు ఎదుర్కొన్న రోజా ఒకానొక దశలో మంత్రి గా, నియోజకవర్గంలో తాను చేసింది ఏంటో చూపించే ప్రయత్నంలో సోషల్ మీడియా సహా మీడియాను కొంత దూరం పెట్టింది. అసలు నగరి నియోజకవర్గంలో తన సొంత పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి వ్యతిరేకంగా ఉన్న ఆమెకు అసలు సీటు లేదు ప్రకటనలు కూడా చేశారు. అయితే జగన్ మోహన్ రెడ్డి ఆమెకు అనుకూలంగా సీటు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా పట్టు ఉన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా ఆమెకు వ్యతిరేకంగా ఉన్నారని పలుమార్లు స్పష్టమైంది.జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శాసించే పరిస్థితి గత ఐదు సంవత్సరాల కాలంలో జరిగేది. అన్ని నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి అనుచరులుగా వ్యవహరించిన పలువురికి ఈసారి ఎన్నికల్లో సీట్లు రావడంతో పాటు ఆయనే ముందుండి ఆర్థిక వ్యవహారాలతో పాటు రాజకీయ వ్యవహారాలు చేశారు. అయితే ప్రజలు ఒకవైపుగా రావడంతో వారి కుటుంబ సభ్యులు కొడుకు తమ్ముడు తప్ప మిగిలిన ఎవరూ గెలిచే పరిస్థితి లేదు. ఇక గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి ఆర్కే రోజాపై పెద్దిరెడ్డి వ్యతిరేకంగా ఉన్న ఎక్కడ బయటపడని పరిస్థితి. స్థానిక నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయి ఒక వర్గం పెద్దిరెడ్డికి అనుకూలంగా ఉండడంతో రోజాకు వ్యతిరేకంగానే ఉండి ఎన్నికల సమయంలో చివర్లో వారు టిడిపి పార్టీలోకి చేరడంతో రోజా ఓటమి బాట పట్టింది. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ప్రభావం స్వల్పంగా ఉన్న అందులో భారీగా నిధులు మంజూరు చేసారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్న క్రీడలు ప్రోత్సహించాలని ఏకంగా రూ.150 కోట్ల మేర ఖర్చు చేసింది గత ప్రభుత్వం.గెలుపు చూడని రోజాకు ప్రజలు 10 సంవత్సరాల కాలం పట్టం కట్టారు. గెలిచి తరువాత ప్రజల్లో... బుల్లి తెర పై కనిపించే రోజా మంత్రిగా మారిన తరువాత అసలు ప్రజలకు అందుబాటులో లేదు...ప్రజల కష్టాలు కాకుండా వారి కుటుంబ సభ్యులు, సోదరుల పెత్తనం ఎక్కువైందని సొంత పార్టీ నేతలతో పాటు కూటమి నాయకులు విమర్శలు చేశారు. అంతవరకు బాగున్న అసలు సమస్య అక్కడే ప్రారంభమైంది. క్రీడా శాఖ మంత్రి గా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆడుదాం ఆంధ్రా అని నిర్వహించారు. సుమారు మూడు నెలల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరిగింది. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు నిధులు వెచ్చించింది. అయితే ఇందులో కొనుగోలు చేసిన క్రీడా సామగ్రి నుంచి పలు రకాలుగా నిధులు దారి మళ్లించారని, నాసిరకం వస్తువులు... కమీషన్లు తీసుకున్నట్లు కూటమి నాయకులు విమర్శలు చేశారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో మాజీ మంత్రి రోజా పై సీఐడీ విచారణ ప్రారంభమైంది.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తిరుమల శ్రీవారి దర్శన టిక్కెట్లు పై దృష్టి సారించింది. ఇందులో రాష్ట్ర మాజీ మంత్రి రోజా కూడా ప్రతిరోజు పదుల సంఖ్యలో టికెట్లు జారీ చేసినట్లు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేశారు. దీనిపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరుగుతుంది. ఇక తాజాగా ఆడుదాం ఆంధ్రా క్రీడలు పై కూడా సీఐడీ విచారణ ప్రారంభం కావడంతో ఎప్పుడైన రోజాను అరెస్టు చేయవచ్చని అంటున్నారు.

# ఉల్లికి భారీ డిమాండ్

- మొదటి పేజీ తరువాయి

అదే ఉల్లి రూ.50కి చేరింది. ఉల్లి ధర 50కిపైగా శాతం పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో ఉల్లి కిలో రూ.50 పలుకుతోంది. అలాగే రైతు బజారులో కిలో ఉల్లి రూ.42 నుంచి రూ.45 పలుకుతుంది. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు ఉల్లి అంటేనే భయపడిపోతున్నారు.సాధారణంగా ఉల్లి ధరలు సెప్టెంబర్ సమయంలో పెరుగుతాయి. అయితే ఈసారి ముందుగానే ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది మహారాష్ట్రలో ఉల్లి పంట దెబ్బతినడమే అందుకు కారణం. మహారాష్ట్రలో ఉల్లి పంటదెబ్బ తినడంతో కర్నూలు ఉల్లికి భారీగా డిమాండ్ పెరిగింది. దానికి తోడు కర్నూలు జిల్లాలో ఉల్లి సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. 30 వేల హెక్టార్లలో పండే ఉల్లి పంట.. ఇప్పుడు కేవలం 9 వేల హెక్టార్లలో మాత్రమే సాగు అవుతోంది. వర్షాలు లేక ఉల్లి దిగుబడి తక్కువ అయినట్లు తెలుస్తుంది.కర్నూలు ఉల్లి మార్కెట్‌లో క్వింటాలు ఉల్లి రూ.2,500 నుంచి రూ.3,500 పలుకుతోంది. దాంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం క్వింటాలు ఉల్లి ధర రూ.500 కూడా లేకపోవడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. ఉల్లి రేట్లు రాను రోజుల్లో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. పంట చేతుకి వచ్చే సమయంలో పడుతున్న వర్షాల వల్ల ఉల్లి మురిగిపోయే అవకాశాలు ఉన్నాయి.

### ఏపీలో ఓ అనాథాశ్రమంలో ఫుడ్ పాయిజనింగ్...

## ముగ్గురు చిన్నారుల మృతి

- మొదటి పేజీ తరువాయి

27 మంది పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. వారిని అనకాపల్లి, నర్సీపట్నంలోని ఆసుపత్రులకు తరలించారు. వారిలో ముగ్గురు చికిత్స పొందుతూ మరణించారు. జాషువా (1వ తరగతి), భవాని, శ్రద్ధ (మూడో తరగతి) అనే ఈ చిన్నారుల మృతితో అనాథాశ్రమంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా, ఈ అనాథాశ్రమంలో మొత్తం 60 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు. వారంతా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ కె.విజయ విచారణకు ఆదేశించారు.

## గ్రామస్థాయిలో రెవిన్యూ వ్యవస్థను తీసుకొస్తాం..

- మొదటి పేజీ తరువాయి

నియమిస్తామన్నారు. ప్రస్తుతం గ్రామ స్థాయిలో రెవెన్యూ లో గ్రామ స్థాయిలో విఆర్‌ఏ లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈవ్యవస్థ బాగుండాలంటే అందరం చిత్తశుద్దితో పని చేయాలన్నారు. ప్రభుత్వం లో తనను రు నెంబర్1 నెంబర్ 2 అంటున్నారని .. నెంబర్లు ముఖ్యం కాదు పరిపాలన ముఖ్యమన్నారు. రెవిన్యూ మంత్రిగా రైతుల అభివృద్ధి కోసం కోట్లాడతానన్నారు.

## పంచాయతీరాజ్ శాఖపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష

- మొదటి పేజీ తరువాయి

ఈవో పీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఏపీవోలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం గ్రామ సభ నిర్వహణ, అందుకు సంబంధించిన విధి విధానాలపై పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ నెల 23న రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పరిధిలో 46 రకాల పనులు చేపట్టవచ్చని అన్నారు. ఈ పథకం ద్వారా వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నామని, ప్రతి రూపాయిని బాధ్యతతో ఖర్చుపెట్టాలని, ఉపాధి హామీ పథకం లక్ష్యం అందుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి, మండల, గ్రామ స్థాయిలో ఉన్న అధికారుల వరకు ఈ పథకం అమలులో బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సోషల్ ఆడిట్ విభాగం పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు.

## పోలవరం ఫైల్స్ దగ్ధం కేసు నలుగురు ఉద్యోగులు సస్పెండ్

- మొదటి పేజీ తరువాయి

దహనం చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తామన్నారు.విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తి లేదని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయం వద్ద కొన్ని ఫైళ్లు కాలిపోయి కనిపించగా పోలీసులకు, అధికారులకు కొందరు సమాచారం అందించారు. కొందరు ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వెళ్లి శనివారం నాడు పరిశీలించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ భూసేకరణ విభాగానికి సంబంధించిన ఫైళ్లు అని తెలుస్తోంది. అయితే ఆఫీసు గేటు బయట సిబ్బంది కొన్ని ఫైళ్లను కాల్చేశారు. విషయం ప్రచారం కావడంతో సగం కాలిన మిగతా ఫైళ్లను సిబ్బంది మళ్లీ లోపలకు తరలించారు. ఓవైపు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోలేదు, మరోవైపు వారంతా సెలవులో ఉన్నప్పుడు ఇది జరిగింది. ఆ ఫైళ్లను ఆఫీసు గేటు బయట వేసి కాల్చివేసిన స్వీపర్ విశాఖ వెళ్లిపోవడంతో అధికార కూటమి నేతల అనుమానాలు వ్యక్తం చేశారు. సమగ్ర శాఖా పరమైన విచారణ చేపడతామని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. ఈ ఘటనతో ధవలేశ్వరం పోలీస్ స్టేషన్లో డిప్యూటీ కలెక్టర్ కె వేదవల్లి ఫిర్యాదు చేశారు. పోలీసు స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 211/2024 ఎఫ్ ఐ ఆర్ గా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ మేరకు పోలీసు స్టేషన్ లో 326 (ఎఫ్) రీడ్ విత్ 3(5) భారతీయ న్యాయ సమ్మత చట్టం, సెక్షన్ 4 ఆఫ్ ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చట్టం 1984 ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఫైళ్లు దగ్దంపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు, శాఖ పరంగా కూడా విచారణ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## సెప్టెంబర్ లో పూర్తి స్థాయి బడ్జెట్

- మొదటి పేజీ తరువాయి

ఆర్థిక శాఖ సర్కులర్ జారీ చేసింది. కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని అంచనాలు పంపాల్సిందిగా ఆర్థిక శాఖ సూచనలు చేసింది. ఇక, ఈ నెల 31వ తేదీలోగా అన్ని శాఖలు బడ్జెట్ అంచనాలను పంపాలని ఆర్థిక శాఖ కోరింది. సంక్షేమ పథకాలకు ఈ పూర్తి స్థాయి బడ్జెట్ లో నిధులు కేటాయించే అవకాశం ఉంది. ఓటాన్ అకౌంట్ లో సూపర్ సిక్స్ పథకాలకు నిధుల కేటాయింపు చేయలేదు. ఈసారి బడ్జెట్ లో ప్రభుత్వం అమలు చేయాల్సి ఉన్న పథకాలకు నిధుల కేటాయింపు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పెన్షన్ రూ.4వేలకు పెంచి ప్రభుత్వం అమలు చేస్తోంది. దసరా నుంచి మరో రెండు స్కీమ్ లను ప్రారంభించాలని భావిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండు సార్లు ఓటాన్ అకౌంట్ బడ్జెట్టుతో ఏపీ సర్కార్ నెట్టుకొస్తుంది.ఇక, మరోవైపు, కేంద్ర ప్రభుత్వం జూలై 23న ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చేసిన కేటాయింపులకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. అలాగే, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోం మంత్రి అమిత్ షాలకూ ఇదే విషయాన్ని విన్నవించారు

# ప్రధానికి పద్మశ్రీ డాక్టర్ల లేఖ


**బ్యూరో రిపోర్టు పెన్‌పవర్, న్యూఢిల్లీ, ఆగస్టు 19:** కోల్‌కత్తాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా డాక్టర్ పై హత్యాచారం ఘటనపై దేశ వ్యాప్తంగా ఆందోళన కొనసాగుతోంది. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఉరి తీయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో పలు రాష్ట్రాల్లో ట్రెయినీ డాక్టర్ కుటుంబానికి మద్దతుగా, దారుణ ఘటనను వ్యతిరేకిస్తూ ర్యాలీలు చేస్తున్నారు. కోల్‌కత్తా డాక్టర్ అత్యాచార ఘటనపై పద్మ అవార్డు గ్రహీతలైన 71 మంది ప్రధాని మోదీకి లేఖ రాశారు. హత్యకు గురైన మహిళా డాక్టర్ కుటుంబానికి సంఘీభావం ప్రకటించిన పద్మశ్రీ డాక్టర్లు.. తమ రక్షణకు చర్యలు సూచించారు. వైద్యారోగ్య రంగంలో సేవలు అందిస్తున్న సిబ్బంది రక్షణపై డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి రాసిన లేఖలో కొన్ని విషయాలపై డాక్టర్లు డిమాండ్లు చేశారు.
డాక్టర్ల 5 ప్రధాన డిమాండ్లు ఇవే..

1) డాక్టర్ల రక్షణ కోసం ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలి
2) లైంగిక దాడులు, నేరాలకు పాల్పడేవారిని కఠినంగా మరియు నిర్ణీత కాలవ్యవధిలోగా శిక్షించేలా చర్యలు
3) ఆస్పత్రులు, వైద్యారోగ్య సంస్థల్లో హెల్త్‌కేర్ సిబ్బంది రక్షణకు మరింత మెరుగైన భద్రతా చర్యలు
4) హెల్త్‌కేర్ నిపుణులు, సిబ్బంది రక్షణ కోసం పటిష్టమైన సరికొత్త చట్టం తీసుకురావాలి
5) కొత్త చట్టంలో వైద్యులపై దాడులకు పాల్పడేవారిపై కఠినమైన శిక్షలు ఉండేలా చూడాలి



# విజయవాడ, హైదరాబాద్ మధ్యలో ఏపీ ఫిలిం సిటీ...






**స్టేట్ బ్యూరో పెన్‌పవర్ విజయవాడ, ఆగస్టు 19:** ఆంధ్ర ప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల వ్యవధిలోనే ఎన్ని మార్పులు చూసామో ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలకు పునాది పడిందో మనమంతా చూస్తూనే ఉన్నాం. కష్టాల్లో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ కి కేంద్ర ప్రభుత్వం కూడా అండగా నిల్చింది. రాజధాని నిర్మాణానికి బడ్జెట్ లో 50 వేల కోట్ల రూపాయలకు పైగానే కేటాయించింది కేంద్ర ప్రభుత్వం. రాష్ట్రానికి ఇంత మంచి రోజులు రావడానికి కారణం నిస్సందేహంగా పవన్ కళ్యాణ్ మాత్రమే. ఆయన ఈ కూటమి కట్టకపోయ్యుంటే నేడు ఇలాంటి పనులు జరిగేవి కావు. ఉపముఖ్యమంత్రి స్థానం లో ఆయన తెలుగు సినిమా ఇండస్ట్రీ బాగోగులు కోసం త్వరలోనే ఒక సంచలన నిర్ణయం తీసుకోబోతున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళ్తే తెలుగు సినిమా ఇండస్ట్రీ మొత్తం హైదరాబాద్ లోనే ఉన్న సంగతి అందరికి తెలిసిందే.దశాబ్దాల తరబడి హైదరాబాద్ లో ఉంటున్న వారు, అన్నీ వదులుకొని ఒకేసారి ఆంధ్ర ప్రదేశ్ షిఫ్ట్ అవ్వడం అంత తేలికైన విషయం కాదు. ఇండస్ట్రీ ని ఇక్కడికి వెంటనే తీసుకొని రాలేకపోయినా, కనీసం ఫిలిం స్టూడియో ఉండాలి అనేది పవన్ కళ్యాణ్ అభిలాష. రీసెంట్ గానే సినీ నిర్మాతలందరూ పవన్ కళ్యాణ్ ని విజయవాడలోని తన క్యాంప్ ఆఫీస్ లో కలిసి ప్రత్యేకంగా భేటీ అయిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ భేటీలో ఇండస్ట్రీ కి సంబంధించి ఎన్నో విషయాలను చర్చించారు. టికెట్ రేట్స్ మీద శాశ్వత పరిష్కారం తో పాటుగా, సినీ స్టూడియో గురించి కూడా చర్చలు నడిచాయి. ఇందులో భాగంగా పవన్ కళ్యాణ్ విజయవాడ, హైదరాబాద్ కి మధ్యలో భారీ ఎత్తున ఫిలిం స్టూడియోస్ కోసం ఉప ముఖ్యమంత్రి హోదాలో భూ సమీకరణ చేస్తున్నాడట. అందుకు సంబంధించిన కార్యక్రమాలు కూడా మొదలుపెట్టినట్టు తెలుస్తుంది. ఈ ఏడాదిలోనే ఈ ఫిలిం స్టూడియో కి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాలనే ప్లాన్ లో ఉన్నాడట పవన్ కళ్యాణ్. మాజీ సీఎం జగన్ ప్రముఖ నిర్మాత సురేష్ బాబు భూములను తీసుకొని ఫిలిం స్టూడియో కట్టించాలని చూసాడు. కానీ ఈ ఫిలిం స్టూడియో కి సంబంధించిన లాభాలు మొత్తం ప్రభుత్వానికే ఇవ్వాలట, సురేష్ బాబు కి కేవలం నెల అద్దె మాత్రమే ఇస్తామని చెప్పారట. అందుకు సురేష్ బాబు ఒప్పుకోలేదు, దీంతో పగబట్టిన మాజీ సీఎం, సినీ ఇండస్ట్రీ మొత్తం తన కాళ్ళ దగ్గర ఉండాలనే ఉద్దేశ్యంతో అప్పటి వరకు ఉన్న టికెట్ రేట్స్ ని భారీగా తగ్గించి ఇండస్ట్రీ ని ముప్పు తిప్పలు పెట్టాడు. ఆ సమయంలో చిరంజీవి పెద్ద మనసు చేసుకొని మాజీ సీఎం జగన్ ని కలిసి ఈ సమస్య కు ఒక తాత్కాలిక పరిష్కారం తెచ్చాడు. ఈ భేటీ లో చిరంజీవితో పాటు రాజమౌళి, మహేష్ బాబు, ప్రభాస్ వంటి వారు కూడా పాల్గొన్న సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పుడు అలా సినీ హీరోలు టికెట్ రేట్స్ కోసం ప్రభుత్వం చుట్టూ తిరగకుండా, స్వతంత్రులు అయ్యేందుకు ఉపముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ కొన్ని మార్పులు చేర్పులు చెయ్యబోతున్నాడు.

## శ్రీలంక మంత్రి సతాశివన్ వియలందేరన్ తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం

**స్టేట్ పొలిటికల్ బ్యూరో పెన్‌పవర్ హైదరాబాద్ ఆగస్టు 19:** శ్రీలంక వాణిజ్య, పర్యావరణ శాఖల మంత్రి సతాశివన్ వియలందేరన్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. 2014 లో భారతదేశంలో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కేవలం పదేళ్ల కాలంలోనే సాధించిన అద్భుత ప్రగతి గురించి గతంలో తాను శ్రీలంక పార్లమెంట్ లో ప్రస్తావించినట్టు ఈ సందర్భంగా సతాశివన్... కేటీఆర్ కు తెలిపారు.
హైదరాబాద్ లోని కేబుల్ బ్రిడ్జి పరిసర ప్రాంతాల అభివృద్ధిని చూస్తే.. సింగపూర్ ను తలపించేలా ఉందని ప్రశంసించారు. ఐటీ, పరిశ్రమల మంత్రిగా కేటీఆర్ తెలంగాణను పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్ గా మార్చిన తీరును సతాశివన్ అభినందించారు. ఓవైపు ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరిగిపోతుంటే... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ ను అవకాశాల అక్షయపాత్రగా మార్చిన తీరు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణలో ఓవైపు ఐటీ, ఇంకోవైపు మ్యానుఫ్యాక్చరింగ్, మరోవైపు ఫార్మా రంగాలకు ఏకకాలంలో పెద్దపీట వేసి పారిశ్రామిక రంగాన్ని మెరుపువేగంతో పరుగులు పెట్టించడం అరుదైన విషయమని తెలిపారు. హైదరాబాద్ వంటి నగరాలే ఏ దేశానికైనా ఆర్థిక ఇంజన్లని, వీటిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉంటుందని అన్నారు. ఓసారి తాను చెన్నై లో పర్యటిస్తున్న సందర్భంలో అక్కడి పోలీసు అధికారితో మాట్లాడానని, తమిళనాడు కంటే.. తెలంగాణ పోలీసులకే ఎక్కువ వేతనాలు అందుతున్నాయనే విషయాన్ని అతను చెప్పారని సతాశివన్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో సాధించిన తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్లపాలనను ఓ యజ్ఞంలా సాగించామని, అందుకే అనతికాలంలోనే అసాధారణ ఫలితాలు సాధించగలిగామని వెల్లడించారు. తెలంగాణకు గుండెకాయలాంటి హైదరాబాద్ లో సంపదను సృష్టించి సంక్షేమం రూపంలో పల్లెపల్లెనా పేదలకు పంచామని కేటీఆర్ తెలిపారు. పారిశ్రామిక రంగానికేకాదు.. పర్యావరణానికి కూడా సమప్రాధాన్యం ఇచ్చామని, తెలంగాణలో 7.7 శాతం గ్రీన్ కవర్ ను పెంచడం దేశంలోనే అరుదైన రికార్డు అని గుర్తుచేశారు.

# అంతు లేని కథలు




**బ్యూరో రిపోర్టు పెన్‌పవర్, విజయవాడ, ఆగస్టు 19:** ఇటీవలి కాలంలో కుటుంబ వివాదాలు వీధికెక్కుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఓవైపు ఇల్లీగల్ కాంటాక్ట్స్.. మరోవైపు ఆస్థి తగాదాలు దుమారాన్ని రేపుతున్నాయి. రాజకీయ సినీ ప్రముఖులు ఈ వివాదాల్లో ఉండటం గమనార్హం. దువ్వాడ శ్రీనివాస్, దువ్వాడ వాణిల కుటుంబ పంచాయతీ పది రోజులుగా పరిష్కారం కాకుండా వివాదాల్లో నలుగుతూనే ఉంది. టెక్కలిలో నిర్మాణంలో ఉన్న ఇంట్లోకి బలవంతంగా వచ్చి ఆందోళన చేసిన వాణిపై దువ్వాడ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై 41 నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. అయితే, నోటీసులు తీసుకోడానికి దువ్వాడ వాణి నిరాకరించారు. ముందు శ్రీనివాస్‌కు నోటీసులు ఇచ్చిన తర్వాతే తనకు ఇవ్వాలని వాణి సూచించారు.తనపై దాడి చేశారంటూ దువ్వాడ వాణి ఇచ్చిన ఫిర్యాదుతో దువ్వాడ శ్రీనివాస్‌పై కేసు నమోదు అయింది. ఐదు రోజుల క్రితం దువ్వాడ వాణి తరపున పెద్ద మనుషులతో దువ్వాడ శ్రీను తమ్ముడు దువ్వాడ శ్రీధర్‌తో చర్చలు జరిపారు. పెద్ద మనుషుల సమక్షంలో ఐదు డిమాండ్లను దువ్వాడ శ్రీధర్‌కు తెలిపారు లాయర్ దివాకర్. 5 డిమాండ్లలో గ్రానైట్ క్వారీపై, టెక్కలిలో ఉన్న ఇంటిపై ఉన్న అప్పులను తీర్చి వాణి కూతుళ్లపై రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేలా ఒప్పందానికి ప్రపోజల్ పెట్టారు. చిన్న కూతురు చదువు, వివాహం అంగీకరించిన దువ్వాడ శ్రీను.. ఐదు డిమాండ్లలో రెండు డిమాండ్లను అంగీకరించలేదు. ప్రస్తుతం ఆందోళన చేస్తున్న ఇంటిని రిజిస్ట్రేషన్ చేయనని దువ్వాడ శ్రీను తేల్చి చెప్పారు.దువ్వాడ వాణితో కచ్చితంగా విడాకులు తీసుకుంటానన్నారు దువ్వాడ శ్రీను. ఈ క్రమంలో ఇప్పటికే విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కారు ఆయన. దువ్వాడ శ్రీను రెండు డిమాండ్లను అంగీకరించకపోవడంతో వాణి రూటు మార్చింది. దువ్వాడ శ్రీను తన భర్త.. ఆతనితో కలిసి ఉండాలన్నదే నా ఉద్దేశం అంటోంది. తాను మెట్టు దిగేఉన్నానని.. తాను ఎలాంటి డిమాండ్స్ పెట్టలేదని.. అదంతా తప్పుడు ప్రచారం అంటూ వాణి బిగ్ ట్విస్ట్ ఇచ్చింది. తనకు ఎలాంటి ఆస్తులు అక్కర్లేదంటోంది దువ్వాడ వాణి. తన పేరు మీద కానీ.. పిల్లల పేర్ల మీద కానీ.. ఆస్తులు రాయమని అడగలేదంటోంది. అందరం ఒకే ఇంట్లో ఉంటే సమాజంలో కుటుంబానికి గౌరవం ఉంటుందని వాణి తెలుపుతోంది. రాజకీయనీగా తన భర్తను డ్యామేజ్ చేయవలసిన అవసరం తనకు లేదంటూ వాణి రూటు మార్చింది. దువ్వాడ శ్రీను, దువ్వాడ వాణిల మధ్య కుటుంబ వివాదం నేటికీ కొనసాగుతోంది.ఇక? ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతి చుట్టూ అలుముకున్న వివాదాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ఆమె వ్యక్తిగత జీవిత అంశాలతోపాటు అధికారాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలు కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆమె వివాహం, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి మీద ఆమె చేసిన ట్వీట్ తదితర అంశాల మీద వివరణ ఇవ్వాలంటూ ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ ఆదేశించారుమరోవైపు విజయ్ సాయి రెడ్డికి వ్యతిరేకంగా ఢిల్లీలో మదన్ ఆందోళన చేశాడు. కాగా, విజయవాడ తాడేపల్లి పోలీస్ స్టేషన్లో మదన్‌పై శాంతి ఫిర్యాదు చేసింది. శాంతి, విజయసాయిరెడ్డిపై మదన్ హోం మంత్రికి ఫిర్యాదు చేశాడు. అయితే, ఇప్పటికే విచారణ పూర్తిచేసిన దేవాదాయ శాఖ ఆమెపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఆమె నుంచి వివరణ కోరినప్పటికీ.. శాంతి వివరాలు ఇవ్వలేదు. మీడియా తీరుపై అసంతృప్తి ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీ విజయసాయి రెడ్డి.. మదన్‌తో శాంతి రాజీ చేసేందుకు నేతలతో ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. అయితే, శాంతిని వదిలేసి విజయసాయి రెడ్డి మదన్ టార్గెట్ చేశాడుఇక ఇటీవలే వివాదాల్లో నలిగిన రాజ్ తరుణ్ వర్సెస్ లావణ్య ఇష్యూలో.. రాజ్ తరుణ్, లావణ్య ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకొని కోర్టు మెట్లు ఎక్కారు. కాగా, ముందస్తు అరెస్ట్ లేకుండా రాజ్ తరుణ్‌కు హైకోర్టులో ఊరట ఇచ్చింది. ప్రతి శనివారం పోలీస్ స్టేషన్ ముందు హాజరు కావాలని ఆదేశించింది. రాజ్ తరుణ్ తనపై కొంత మందిని ఉసిగొల్పి తప్పుడు ప్రచారం చేపిస్తున్నాడని లావణ్య ఆరోపిస్తోంది.మరోవైపు మస్తాన్ సాయి డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయ్యాడు. మస్తాన్ సాయితో ఉన్న సంబంధంపై రాజ్ తరుణ్ ఇదివరకే క్వశ్చన్ చేశాడు. రాజ్ తరుణ్, మస్తాన్ సాయి తనపై కుట్ర పన్ని ఇలా అన్నిట్లోనూ ఇరికించారని లావణ్య ఆరోపిస్తోంది. మస్తాన్ సాయి ఫోన్‌లో తన వ్యక్తిగత వీడియోలు ఉన్నాయంటోంది ఆమె. రాజ్ తరుణ్‌ను లావణ్య వేధిస్తుందంటూ తప్పుడు కేసులు పెట్టి బ్లాక్ మెయిల్ చేస్తుందంటూ లావణ్యపై శేఖర్ భాష పోరాటం చేస్తున్నాడు. రాజ్ తరుణ్ కోసం పెయిడ్ ఆర్టిస్ట్‌గా శేఖర్ బాష తనపై ఆరోపణలు చేస్తున్నాడని లావణ్య తెలుపుతోంది.రాజ్ తరుణ్ లావణ్య వ్యవహారం గత రెండు నెలల నుంచి రోజుకో మలుపు తిరుగుతూ ఆసక్తి రేపుతోంది. మరో వైపు తన వ్యక్తిగత ఫోటోలు బయటకు రిలీజ్ చేసి తన ప్రతిష్టను దిగజార్చిందంటూ ప్రీతి సైబర్ క్రైమ్‌ను ఆశ్రయించింది. ప్రీతి, ఉదయ్‌లపై గంజాయి డ్రగ్స్ ఆరోపణలు చేసిన లావణ్య.. దానికి తగ్గ సాక్ష్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలే నిదర్శనమని లావణ్య తెలుపుతోంది.మొత్తంగా దువ్వాడతో పాటు, విజయసాయి రెడ్డి, రాజ్ తరుణ్‌ల వ్యక్తిగత వ్యవహారాలు అంతులేని కథగా మారాయి.

# ఆగని ఆరాచకాలు...

- మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో ఆ ముగ్గురు వీరికి పరిచయం అయ్యారు. ఆంధ్రప్రదేశ్లోని ఏలూరు నగరంలో మరో దారుణం చోటుచేసుకుంది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఓ వివాహిత భర్తతో మద్యం తాగిన కొంతమంది యువకులు.. ఆ తర్వాత అతనిపై దాడి చేశారు. అనంతరం ఆమెపై అత్యాచారం చేశారు. ఏలూరు నగరంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దారుణం చోటుచేసుకుంది. ఏలూరు నగరంలోని మూడు పోలీస్ స్టేషన్ లకు కొంత దూరంలోనే ఈ ఘటన జరిగింది.ఏలూరు వన్ టౌన్ రామకోటి ప్రాంతంలో పెదవేగి మండలం విజయరాయి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన రెండవ భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. 15 రోజుల క్రితమే వీరు ఆ ప్రాంతానికి వచ్చారు. వీరిద్దరూ పగటిపూట ఆ నగరంలోని హోటల్ లో పనిచేస్తున్నారు. రాత్రి సమయంలో రామకోటి ప్రాంతంలోని కల్చరల్ ఆక్టివిటీస్ నిర్వహించే ఓ వేదికపై పడుకుంటున్నారు. అద్దెకు ఇల్లు దొరకపోవడంతో వారు గత కొద్ది రోజులుగా ఇలానే చేస్తున్నారు.ఈ దంపతులకు ఏలూరు నగరానికి చెందిన ముగ్గురు యువకులు ఇటీవల పరిచయం అయ్యారు. వారు కూడా చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. పనులు దొరకని సమయంలో ఖాళీగా రోడ్లపై తిరుగుతుంటారు. శుక్రవారం అర్ధరాత్రి ఈ ముగ్గురు యువకులు , విజయరాయి ప్రాంతానికి చెందిన వ్యక్తితో కలిసి మద్యం తాగారు. ఆ సమయంలో అటు పక్కనే అతడి భార్య పడుకుంది. మద్యం బాగా తాగిన తర్వాత ఆ ముగ్గురు యువకులు అతనిపై తీవ్రంగా దాడి చేశారు. అనంతరం పక్కనే పడుకుని ఉన్న అతడి భార్యను కొంత దూరం లాక్కుని వెళ్లారు. ఆమె ముఖంపై తీవ్రంగా దాడి చేశారు. అనంతరం అత్యాచారం చేశారు. వారు చేస్తున్న ఘాతుకాన్ని చూడలేక ఆమె భర్త కేకలు వేస్తూ రోడ్డుపైకి వచ్చాడు. అటుగా వెళుతున్న యువకుడికి విషయం చెప్పాడు. ఆ యువకుడు ఆ ఘటన స్థలానికి వెళ్ళగా నిందితులు ముగ్గురు పరారయ్యారు. ఆ బైక్ పై వచ్చిన యువకుడు డయల్ 100 కు కాల్ చేసినప్పటికీ పోలీసులు స్పందించలేదు. ఆ నెంబర్ కి కాల్ చేస్తే చేస్తాం, చూస్తామని పోలీసులు సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కి వెళ్లి విషయం చెబితే.. వారు నిమిషాల్లోనే అక్కడికి వెళ్లారు?ఈ ఘటనలో ముగ్గురు నిందితులను ఏలూరు వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చెంచుల కాలనీకి చెందిన నూతి పల్లి పవన్, లంబాడి పేటకు చెందిన నారపాటి నాగేంద్ర, మారడాని రంగారావు కాలనీకి చెందిన గడ్డి విజయ్ కుమార్ అలియాస్ నాని ని వన్ టౌన్ ఎస్ఐ లక్ష్మణ్ బాబు, సిబ్బంది అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

## లాంగ్ లీవ్ ఆలోచనలో ఐపీఎస్ లు

**నాగేశ్వర రావు (నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు**

పని లేని శిక్ష.. ఏపీలో 16 మంది ఐపీఎస్ ఆఫీసర్లకు కలవరం పుట్టిస్తోందట?. ఇన్నాళ్లు వెయిటింగ్‌లో పెట్టినా చింతించని ఐపీఎస్‌లు? రోజూ ఆఫీసుకు రావాలని జారీ చేసిన మెమోతో తల పట్టుకుంటున్నారు? పనిలేకుండా ఖాళీగా కూర్చోలేమంటూ సెలవు తీసుకునేందుకు రెడీ అవుతున్నారట? కానీ, ప్రభుత్వం ఐపీఎస్‌ల పట్ల కఠినంగానే వ్యవహరించాలని భావిస్తోందట.పనిఉన్నా, లేకపోయినా, రోజా ఆఫీసుకు రావాల్సిందే.. హాజరు వేసుకోవాల్సిందేనంటూ ఖరాకండీగా చెప్పేస్తుందట? దీంతో ఈ క్లిష్ట పరిస్థితి నుంచి బయటపడేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారట ఐపీఎస్‌లు. ఎక్కువ మంది దీర్ఘకాలిక సెలవు కోసం దరఖాస్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. మరి ప్రభుత్వం ఐపీఎస్‌లకు సెలవు ఇస్తుందా? లేదా? అనేదే ఇప్పుడు ఇంట్రెస్టింగ్ మారింది.వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలను తవ్వితీస్తున్న ప్రభుత్వం?. ఆ అక్రమాలకు సహకరించారనే ఆరోపణలతో పక్కన పెట్టిన 16 మంది ఐపీఎస్‌లపై సీరియస్‌గా వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అధికారంలోకి రాగానే పక్కన పెట్టిన ఈ 16 మందిలో ఏ ఒక్కరికీ పోస్టుంగ్ ఇవ్వకపోవడమే కాకుండా? ఇప్పుడు రోజూ డీజీపీ ఆఫీసుకు వచ్చి హాజరు వేయించుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో కంగుతిన్న ఐపీఎస్‌లు? సెలవు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.కొందరు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తుండగా, మరికొందరు ప్రభుత్వం ఆగ్రహం చల్లారేవరకు సెలవు తీసుకోవడం బెటర్ అనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రెండు నెలలుగా పోస్టుంగులు లేకపోయినా, ఇంటి వద్ద, వ్యక్తిగత పనులపైనా ఎక్కువ సమయం గడిపిన ఐపీఎస్‌లకు రోజూ ఆఫీసుకు రావాలని నిబంధన చికాకు పుట్టిస్తోందంటున్నారు.పనిలేకుండా ఖాళీగా ఉంచడమంటే అవమానించడమేనని భావిస్తున్న అధికారులు? ఆ అవమాన భారం నుంచి తప్పించుకునేందుకు సెలవు తీసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారంటున్నారు. ప్రస్తుతం నాలుగు రోజులు వరుస సెలవులు రావడంతో సోమవారం వరకు ఆఫీసుకు వెళ్లే అవసరం లేదని, సోమవారం హాజరు వేయించుకుని సెలవు తీసుకోవాలని భావిస్తున్నారట ఆ 16 మంది ఐపీఎస్‌లు.ఐతే, 16 మంది ఐపీఎస్‌ల్లో ఏ ఒక్కరికీ సెలవు ఇవ్వొద్దని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం హిట్‌లిస్టులో ఉన్న ఐపీఎస్‌లు సెలవులో ఉన్నా, బయట ఖాళీగా ఉన్నా, కొన్ని ప్రత్యేక కేసుల్లో తలదూర్చే అవకాశం ఉందనే అనుమానంతో రోజూ డీజీపీ ఆఫీసుకు రప్పించాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు.పని లేని పనిష్మెంట్ అనుభవిస్తున్న ఐపీఎస్‌ల్లో డీజీ క్యాడర్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, పీవీ సునీల్‌కుమార్, ఏడీజీ ఎన్.సంజయ్‌లు దీర్ఘకాలిక సెలవు తీసుకోవాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐతే వీరికి నేరుగా జీఏడీయే సెలవు మంజూరు చేయాల్సిరావడం, జీఏడీని సీఎంవో పర్యవేక్షిస్తుండటంతో సెలవు ఇచ్చే పరిస్థితి లేదంటున్నారు. దీంతో దాదాపు సుదీర్ఘ సర్వీసు ఉన్న ఐపీఎస్‌లు? రిటైర్మెంట్ ముందు ప్రభుత్వం చర్యలపై భయపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.ముఖ్యంగా సెలవు కోసం ప్రయత్నిస్తున్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందంటున్నారు. గత ప్రభుత్వంలో నిఘా డీజీగా పనిచేసిన ఆయన? చాలామంది టీడీపీ నేతలను వేధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆయనకు పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్‌లో పెట్టింది ప్రభుత్వం. వాలంటరీ రిటైర్మెంట్‌కు ప్రయత్నించినా సర్కారు కరుణించలేదు.సరికదా ఆంజనేయులు విషయంలో గత సర్కార్ రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు పట్ల అనుసరించిన విధానాన్ని ఉదహరిస్తుండటంతో?. ఏం జరుగుతుందనే ఆసక్తి పెరుగుతోంది. ఇక సీనియర్ అధికారులు పీవీ సునీల్‌కుమార్, ఎన్.సంజయ్ గత ప్రభుత్వంలో పెద్దలకు సన్నిహితంగా మెలిగారని, నిబంధనలకు విరుద్ధంగా వ్యహరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీంతో వీరిపట్ల కఠినంగా ఉండాలనే సంకేతాలు పంపుతోంది ప్రభుత్వం. ఈ ఇద్దరూ దీర్ఘకాలిక సెలవు కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం ససేమిరా అన్నట్లు తెలుస్తోంది.వాస్తవానికి పక్కన పెట్టిన 16 మందిపై వేటు వేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు చెబుతున్నారు. తగిన తగిన ఆధారాల కోసం ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఎవరికీ సాధారణ, దీర్ఘకాలిక సెలవులు ఇవ్వకుండా ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఎవరికైనా అత్యావసర సెలవు మంజూరు చేస్తే? పిలవగానే వచ్చి హాజరు కావాలని సూచిస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి ఐపీఎస్‌ల వ్యవహారశైలిని నిశితంగా పరిశీలిస్తున్న ప్రభుత్వం? కఠిన చర్యలు ఉంటాయనే సంకేతాలు పంపుతోందంటున్నారు

## ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్ని




**స్పోర్ట్స్ బ్యూరో పెన్‌పవర్ విజయవాడ, ఆగస్టు 19:** ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నూతన అధ్యక్షుడిగా టీడీపీ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే నెల 8న విడుదల కానుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కుటుంబ సభ్యులు, అనుచరులచేతుల్లోనే ఏసీఏ ఉండేది. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత వీరంతా తమ పదవులకు రాజీనామా చేశారు. విజయవాడలో ఈ నెల 4న జరిగిన సర్వసభ్య సమావేశంలో వీరి రాజీనామాలను ఆమోదించారు. కొత్త కార్యవర్గం కోసం కసరత్తు ప్రారంభమైంది. అధ్యక్షుడితోపాటు అపెక్స్ కౌన్సిల్‌లోని ఆరు పదవులకు శుక్రవారం విశాఖ స్టేడియంలో నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్షుడిగా కేశినేని చిన్ని, ఉపాధ్యక్షుడిగా పి.వెంకట ప్రశాంత్, కార్యదర్శిగా సానా సతీశ్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా పి.విష్ణుకుమార్‌రాజు (విశాఖ నార్త్ ఎమ్మెల్యే), కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్‌గా డి. గౌరు విష్ణుతేజ్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇంకెవరూ నామినేషన్లు వేయకపోవడంతో వీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 8న ఈ ఎన్నికను అధికారికంగా ప్రకటించనున్నారు. ఆ తర్వాతి రోజున అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తారు

# రంజీల్లో మహమ్మద్ షమీ.. టీమిండియా రీ ఎంట్రీ అప్పుడే



మిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీ టీమిండియా రే ఎంట్రీ విషయంలో సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. స్వదేశంలో జరిగిన 2023 వన్డే వరల్డ్ కప్ తర్వాత షమీ భారత జట్టుకు దూరమయ్యాడు. చీలమండ గాయంతో సర్జరీ చేయించుకున్న ఈ స్పీడ్ స్టార్ ఇటీవలే బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (%చీజూూ%)లో నెట్స్‌లో బౌలింగ్ చేయడం ప్రారంభించాడు. దీంతో బంగ్లాదేశ్ తో సెప్టెంబర్ లో జరగబోయే టెస్ట్ సిరీస్ కు అందుబాటులో ఉంటాడని అంతా భావించారు. అయితే ఇప్పుడు షమీ రంజీ ట్రోఫీ బాట పట్టనున్నాడు.

34 ఏళ్ల షమీ సెప్టెంబర్ లో జరగబోయే బంగ్లాదేశ్ సిరీస్ కు దూరం కానున్నాడు. పూర్తి ఫిట్ నెస్ సాధించడానికి అతడు రంజీ ట్రోఫీ ఆడనున్నాడని తెలుస్తుంది. తన సొంత జట్టు బెంగాల్ తరపున అక్టోబరు 11న ఉత్తరప్రదేశ్‌తో మ్యాచ్ ఆడడానికి షమీ సిద్ధమయ్యాడని తెలుస్తుంది. ఈ మ్యాచ్ తో పాటు కోల్‌కతాలో బీహార్‌తో అక్టోబర్ 18న మ్యాచ్ కు షమీ అందుబాటులో ఉంటాడు. రంజీ ట్రోఫీలో కేవలం ఈ పేసర్ రెండు మ్యాచ్ లే ఆడనున్నాడని సమాచారం. దీని ప్రకారం షమీ అక్టోబర్ లో న్యూజిలాండ్ తో జరగబోయే మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ కు అందుబాటులో ఉండనున్నాడు.

గతేడాది వరల్డ్ కప్ లో షమీ 24 వికెట్లు తీసి టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత మడమ గాయానికి గురైన ఈ పేసర్.. సుమారు ఎనిమిది నెలలుగా

టీమిండియాకు దూరంగా ఉన్నాడు. ఫిబ్రవరి నెలలో ఎడమ చీలమండకు సర్జరీ చేయించుకున్నాడు. లండన్‌లోని ఓ హాస్పిటల్‌లో ఈ సర్జరీ నిర్వహించారు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్, ఇంగ్లండ్ సిరీస్ లకు దూరమయ్యాడు.

# నేను దేశంలోనే అత్యుత్తమ స్పిన్నర్.. భారత జట్టులోకి తీసుకోండి: యువ క్రికెటర్ డిమాండ్

టీంఇండియాలో చోటు దక్కించుకోవడం అంత సామాన్యమైన విషయం కాదు. ముఖ్యంగా స్పిన్ విభాగంలో చాలా కష్టం. స్పిన్నర్లు ఎక్కువగా ఉండే మన దేశంలో ఎంతో అనుభవమున్న యుజ్వేంద్ర చాహల్ కు సైతం జట్టులో స్థానం దక్కడం లేదు. ఇదంతా తనకు సంబంధం లేదంటూ తమిళ నాడు స్పిన్నర్.. ఐపీఎల్ లో గుజరాత్ టైటాన్స్ ఆడుతున్న సాయి కిషోర్ తనను భారత టెస్ట్ జట్టులో సెలక్ట్ చేయాలని డిమాండ్ చేశాడు.

దులీప్ ట్రోఫీకి ముందు సాయి కిషోర్ సెలక్టర్లు తనను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. "నేను దేశంలోని అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడినని భావిస్తున్నాను. నన్ను టెస్ట్ మ్యాచ్‌లకు సెలక్ట్ చేస్తే నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. నేను ఎక్కువగా ఆందోళన చెందాల్సిన పని లేదు. జడేజాతో కలిసి దులీప్ ట్రోఫీ ఆడబోతున్నాను. అతని అనుభవం నాకు కలిసి వస్తుంది". అని ఈ యువ క్రికెటర్ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం భారత టెస్ట్ జట్టులో అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ లాంటి స్టార్ స్పిన్నర్లున్నారు. వీరిని పక్కన పెట్టి సాయి కిషోర్ కు భారత టెస్ట్ జట్టులో అవకాశం దక్కడం కష్టంగానే కనిపిస్తుంది. సాయి కిషోర్ తన స్పిన్ తో పాతూరి బ్యాటింగ్ లోనూ మెరుపులు మెరిపించగలడు. ఆల్ రౌండర్ గా ఐపీఎల్ లో గుజరాత్ టైటాన్స్ తరపున 19.57 సగటుతో 5 మ్యాచ్‌లలో 7 వికెట్లు పడగొట్టి పర్వాలేదనిపించాడు. ఆ తర్వాత తమిళ నాడు



ప్రీమియర్ లీగ్ లో అదరగొట్టిన ఈ యువ స్పిన్నర్.. ప్రస్తుతం బుచ్చి బాబు టోర్నీలో ఆడుతున్నాడు. ఈ టోర్నీ ముగియగానే దులీప్ ట్రోఫీతో బిజీ కానున్నాడు.

# : రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు అస్వస్థత



ఢిల్లీ: రెజ్లర్, ఒలింపిక్ క్రీడాకారిణి వినేశ్ ఫొగాల్ అస్వస్థతకు గురైంది. పారిస్ నుంచి ఇండియాకు వచ్చిన ఆమెకు ఢిల్లీ, హర్యానలో ఘనస్వాగతం లభించింది. హర్యానాలోని బలాలికి చేరుకున్న ఆమెకు స్థానికులు ఘనస్వాగతం పలికారు.. ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి భారీ లడ్డూను బహూకరించారు. సుదీర్ఘమైన ప్రయాణంతో తీవ్రంగా అలసిపోయిన వినేశ్.. సమావేశం జరుగుతుండగానే అస్వస్థతకు గురైంది. కాసేపు కుర్చీలోనే ఉండిపోయింది. ఇప్పుడా వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

వినేశ్ ఫొగాట్ పక్కనే ఆమె పెదనాన్న మహవీర్ ఫొగాట్, రెజ్లర్ బజరంగ్ పునియా తదితరులు ఉన్నారు. కొద్దిసేపటికి మంచినీటిని తాగిన తర్వాత వినేశ్ కాస్త తేరుకున్నట్లు కనిపించింది. "ఎక్కువ సమయం ప్రయాణించడం, షెడ్యూలింగ్ కారణంగా ఆమె కాస్త ఇబ్బంది పడింది. స్వగ్రామంలో వినేశ్‌కు అద్భుతమైన స్వాగతం లభించింది" అని పునియా వెల్లడించాడు. శనివారం ఉదయం ఢిల్లీ నుంచి బయల్దేరిన ఆమె మధ్యలో అభిమానులను కలుస్తూ 13 గంటల తర్వాత బలాలీకి చేరుకుంది. అర్ధరాత్రి ఇంటికి చేరిన ఆమెకు గ్రామస్తులు, ఇరుగు పొరుగు, స్నేహితులు పూల దండలతో స్వాగతం పలికారు. అంతకుముందు డబ్ల్యూఎఫ్‌పై వ్యతిరేకంగా జరిగిన నిరసన గురించి వినేశ్ మాట్లాడింది. 'ఈ పోరాటంలో మాకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. జీవితమే ఒక పోరాటం. మా పోరాటం ముగిసిపోలేదు. న్యాయం కోసం మేం ఏడాదిగా పోరాడుతున్నాం. దాన్ని కొనసాగిస్తాం. దేవుడి దయతో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం' అని తెలిపింది.

డిజైనర్ డ్రెస్‌లో కరిష్మా తన్నా అబ్బురపరిచే క్లిక్‌లు



# సామ్ బ్రేక్.. ఎంత ఆదాయం పోతుందో తెలుసా?



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి తెలియనివారు ఎవరూ ఉండరేమో. ఆమె దాదాపు దశాబ్దానికి పైగా సినిమాలు చేస్తూ, దక్షిణాది ప్రజలను అలరిస్తూ వస్తున్నారు. ఆమెకు రోజు రోజుకీ క్రేజ్ పెరుగుతుందే కానీ, తగ్గుతున్నది లేదు. ముఖ్యంగా, ది ఫ్యామిలీ మ్యాన్ వెబ్‌సిరీస్‌లో తన నటనతో జాతీయ దృష్టిని ఆకర్షించినప్పటి నుండి సమంత క్రేజ్ రోజు రోజుకీ పెరిగిపోతోంది.అయితే, ఆమె తన అనారోగ్య కారణాల వల్ల సంవత్సరం పాటు సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. చాలా మంది దర్శక నిర్మాతలు ఆమెతో సినిమాలు చేయాలని ఉత్సాహం చూపిస్తున్నా కూడా ఆమె మాత్రం సినిమాలు చేయడానికి అస్సలు సముఖతగా లేరు. ఆమె తన ఆరోగ్యం పూర్తిగా సెట్ అయ్యే వరకు మళ్లీ ఎలాంటి సినిమా చేయాలని అనుకోవడం లేదు. అయితే, ఈ బ్రేక్ కి ముందు సమంత తన పారితోషకం పెంచేసింది. ఫ్యామిలీ మ్యాన్ 2 తర్వాత ఆమె తన రెమ్యూనరేషన్ ని రూ.10 కోట్లకు పెంచేసింది. ఆమె చివరగా ఖుషీ, సిటాడెల్ ల కోసం రూ.5 కోట్లు తీసుకుంది. అయితే, తాను ప్రస్తుతం సంవత్సరం పాటు బ్రేక్ తీసుకోవడంతో దాదాపు సమంత రూ30కోట్లు నష్టపోవాల్సి రావడం గమనార్హం. చేతిలో ఉన్న సినిమాలను వదులుకోవడంతో పాటు, ఆమె చేతిలో ఉన్న బ్రాండ్స్ కి కూడా దూరంగా ఉండే అవకాశం ఉంది. దీంతో, సమంత కేవలం ఒక్క సంవత్సరం గ్యాప్ తీసుకోవడం వల్ల రూ.30కోట్ల నష్టం వాటిల్లుతోందని తెలిసి ఫ్యాన్స్ షాకౌతున్నారు, అయితే, ఆమె ఆరోగ్యం కంటే, ఈ డబ్బు ఎక్కువ కాదు అని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, సమంత మూవీలకు బ్రేక్ ఇచ్చినా, ఆమె క్రేజ్ మాత్రం బాగా పెరిగింది. ఓర్మాక్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో సమంత ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఆమె అగ్ర తారలను వెనక్కి నెట్టి, మొదటి స్థానంలోకి చేరడం విశేషం. దేశంలోని స్టార్ల టాప్ ర్యాంకింగ్స్ ఇక్కడ ఉన్నాయి. వరుసగా సమంత (1) అలియా భట్ (2), దీపికా పదుకొణె (3), నయనతార (4), కాజల్ అగర్వాల్ (5) ఉన్నారు. టాప్ 10 జాబితాలో త్రిష (6), కత్రినా కైఫ్ (7), కియారా అద్వానీ (8), కీర్తి సురేష్ (9), రష్మిక మందన్న (10) చోటు దక్కించుకోవడం విశేషం.



నీలి రంగులో నికితా దత్తా యొక్క ట్రెండీ ఫోటోషూట్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com